

# ఉన్నతుని క్షమాగుణం

కన్యాకుబ్జాన్ని విశ్వామిత్రుడు పరిపాలిస్తున్న రోజులు. శత్రుభయంకరుడై ధర్మాత్మునిగా రాజ్యమేలుతూ విశ్వామిత్రుడు ఒకసారి అక్షౌహిణీ సైన్య సమేతుడై భూప్రదక్షిణానికి బయలుదేరాడు. అలా ప్రయాణిస్తూ వసిష్ఠుని ఆశ్రమందాపుకు చేరాడు.

మరో బ్రహ్మలోకంలా తాపసులతో వన్యమృగాలతో కళకళలాడుతున్నది వశిష్ఠాశ్రమం. దేవ, దానవ, గంధర్వ, కిన్నెర, సిద్ధ, చరణాదులకెందరికో ఆ ఆశ్రమం తీర్థస్థానం. కందమూల ఫలాలను స్వీకరిస్తూ ఇంద్రియ జాయాన్ని కోరి జపతపాదులతో సాధన చేస్తున్న ఋషులతో నిండిన ఆ ఆశ్రమానికి వెళ్ళాడు. విశ్వామిత్రుడు ఇరువురి మధ్య కుశలప్రశ్నల సంభాషణ సాగింది. పరస్పరం గౌరవంగా మంచిమాటలు మాట్లాడుకున్నారు. కొద్దిసేపయ్యాక విశ్వామిత్రుడు సెలవుతీసుకోవడానికి అనుమతి అడిగాడు. ససైన్యంగా ఆతిథ్యాన్ని స్వీకరించమని ఆత్మీయంగా బలవంతం చేసాడు వశిష్ఠుడు. కాదనలేకపోయాడు విశ్వామిత్రుడు. వశిష్ఠుని వద్ద కామధేనువు పుత్రికయిన "శబళ" ఉన్నది. కోరిన వాటినన్నింటినీ సమకూర్చగల దివ్యశక్తి సంపన్నురాలు కావడంచేత వశిష్ఠుడు కోరిందే తడువుగా విశ్వామిత్రుని సమస్త పరివారానికి షడ్రసోపేతమయిన అద్భుతమయిన విందును అప్పటికప్పుడే "శబళ" సమకూర్చింది. ఆశ్చర్యచకితుడయ్యాడు విశ్వామిత్రుడు. ఇంతటి పరమాద్భుతమయిన శక్తి సామర్థ్యాలున్న గోవు తనలాంటి చక్రవర్తి దగ్గర ఉంటేనే సార్థకమౌతుందని నిర్ణయించుకున్నాడు. వేల ఆవులనిస్తానన్నాడు. బంగారంతో నిండిన 14 వేల ఏనుగుల నిస్తానన్నాడు. 11వేల గుర్రాలనిస్తానన్నాడు. వశిష్ఠుడు తిరస్కరించే కొద్దీ విశ్వామిత్రుడి పట్టుదలా పెరిగింది. ఈసారి కోటి గోవుల్ని ఇస్తానన్నాడు. రత్నాలు, బంగారం, ఏది అడిగితే అది ఇస్తానన్నాడు విశ్వామిత్రుడు. ఏది ఇచ్చినా శబళని ఇచ్చేది లేదన్నాడు వశిష్ఠుడు. అప్పటిదాకా ముఖానికి తగిలించుకున్న గౌరవ మర్యాదలు తొడుగుల్ని తీసి ప్రక్కనబెట్టాడు విశ్వామిత్రుడు. "రాజునన్న అహం విశ్వరూపం దాల్చి విర్రవీగింది. తన కోర్కెను తిరస్కరించినందుకు కోపంతో రాజు రగిలిపోయాడు. నిర్లజ్జగా తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టడానికి సిద్ధమయ్యాడు. పిలిచి భోజనం పెట్టినవాడినే నట్టడవిలో నిలువునా దోచుకోవడానికే నడుం కట్టాడు. రాజు అజ్ఞతోనే భటులు పశువును ఈడ్చుకెళ్ళే ప్రయత్నం చేసారు.



డా॥ ప్రతాపదక్షిణా

అక్షౌహిణీ బలం చూసుకొని మిడిసి పడుతున్నరాజు దురాగతానికి తగిన బుద్ధి చెప్పడానికి వశిష్ఠుని అనుమతి తీసుకుని సిద్ధమైంది 'శబళ'. పహ్లావులు,యవనులు, శకులు, కాంభోజులవంటి వీరులెందరినో శబళ సృష్టించి విశ్వామిత్రుని సైన్యాన్ని సర్వనాశనం చేసింది. అదిచూచి విశ్వామిత్రుని కుమారులు వశిష్ఠుని వధించడానికి వెళ్ళి అతని హుంకారానికి బూడిదయ్యారు. తన పుత్రులకు, సైన్యానికి పట్టిన

గతిని తిలకించి నిశ్చేష్టుడయ్యాడు విశ్వామిత్రుడు. తగిన ప్రతీకారం చేయకుండా రాజ్యానికి మరలడానికి అతనికి మనసొప్పలేదు. మిగిలిన కుమారుడికి పట్టంకట్టి ఆ పరమశివుడిని ప్రసన్నం చేసుకోవడానికి హిమాలయాలకు అటునుండి అటే వెళ్ళిపోయాడు.

ధనుర్వేదాధిష్ఠానదేవత, లయకారుడు అయిన పరమశివుడిని తన ఘోర తపస్సుతో ప్రసన్నం చేసుకొని సాంగోపాంగంగా ధనుర్వేద రహస్యాలను తెలుసుకున్నాడు విశ్వామిత్రుడు. దివ్యాస్త్ర శాస్త్రాలతో ప్రతీకారేచ్ఛతో వసిష్ఠుని ఆశ్రమం మీదకి విరుచుకు పడ్డాడు విశ్వామిత్రుడు. అయితే వశిష్ఠుని బ్రహ్మదండం విశ్వామిత్రుని దివ్యాస్త్ర సంపత్తిని విఫలం చేసింది. మరొకసారి ఓడిపోయినందుకు విశ్వామిత్రుడు కుమిలిపోయాడు. వశిష్ఠుని మించిపోవాలంటే తానూ అంతటి కఠోర తపస్సు చేయాలని నిర్ణయించుకున్నాడు. వసిష్ఠునివలె తానూ బ్రహ్మర్షి కావాలనే పట్టుదలతో ఎన్నో విఘ్నాలకోర్చి, ప్రయాసలకు, భంగపాట్లకు గురై విశ్వామిత్రుడు చివరకు అనుకున్నది సాధించగలగడమే కాకుండా పరిపూర్ణ వికాసాన్ని పొంది శ్రీరామ చంద్రునికి గురువై సీతారామ కళ్యాణం ద్వారా నిజంగా విశ్వామిత్రుడు కాగలిగాడు. విశ్వామిత్రుడు ఈ విధంగా ఆయన కృషిచేసి సాధనకు, పట్టుదలకు ప్రతీకగా చరిత్రలో నిలిచి మానవాళికి మహోన్నత ఆదర్శమూర్తి అయ్యాడు. అలాగే వసిష్ఠుని క్షాంతి కూడా ఎంతో ప్రశంసనీయమైనది. శబళగాని తానుగాని తమపై దురాగతానికి పాల్పడ్డ విశ్వామిత్రుడిని ససైన్యంతో సభాంధవంగా వధించవచ్చు. అంత శక్తి ఉన్నప్పటికీ వసిష్ఠుడు ఆపని చేయలేదు. ఓటమితో తలవంచుకున్న విశ్వామిత్రుడిలో మార్పును ఆశించాడాయన. ఆత్మ రక్షణకే ప్రాధాన్యతనిచ్చాడు తప్ప ఎదుటివారి నాశనాన్ని కోరుకోలేదు.

విశ్వామిత్రుడు దివ్యాస్త్రాలతో దాడికి తెగపడినప్పుడు కూడా అదేవిధానం శత్రువుగా తనను భావించి నాశనం చేయడానికి సర్వశక్తులొడ్డి పోరాడినా విశ్వామిత్రుడిని శత్రువులా భావించక అతనిని ప్రాణాలతో ఒదిలిపెట్టడం అతడి తప్పును అతడే తెలుసుకునేట్లు చేయడం. వశిష్ఠుడి క్షమాగుణానికి సంకేతం. అది శక్తివంతుడి క్షమావిధానం.

ఓం శ్రీమాత్రేనమ